అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
గురువారం 23 మార్చి 2023

సీఐకి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సన్మానం

ఖానాపూర్ : ఖానాపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నారాయణ నాయక్‌ను బుధవారం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు, ఎస్సి ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావ్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాణావత్ గోవింద్ నాయక్, గౌరవాధ్యక్షుడు భూక్య కిషన్ నాయక్, ఏఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అజ్మీరా శంకర్ నాయక్, జర్పుల రాజేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.



నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30గంటల ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, పడగంటి కిష్టయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సీ విజన్ కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పోలీస్, సింగరేణి ఉద్యోగులు, జర్నలిస్టులకు నగదు రహిత శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు కలిగిన వారికి చికిత్సలు చేస్తామని పేర్కొన్నారు.

జనంతో మమేకం..చైతన్యమే ప్రధానం..!

- నేటి నుంచి సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర
- ఆదిలాబాద్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభం
- హాజరుకానున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు
- ఎస్.వీరయ్య నేతృత్వంలో బస్సు జాతా
- ఉమ్మడి జిల్లాలో మూడు రోజులు సాగనున్న యాత్ర

బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టింది. జనంతో మమేకం కావడం..వారిలో పోరాట స్ఫూర్తి నింపడం.. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్యం చేయడంతో పాటు సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడేందుకు ఈ యాత్ర చేపడుతోంది. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుండి జాతాలు ప్రారంభం కావాల్సి ఉండగా ఈ నెల 17న వరంగల్‌లో ప్రారంభమైంది. రెండో యాత్ర ఆదిలాబాద్ జిల్లాలో గురువారం నుంచి మొదలుకానుంది. ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య నాయకత్వం వహించనుండగా.. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు ఈ యాత్రను ప్రారంభించనున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఈ యాత్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు రోజుల పాటు కొనసాగనుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి





జనంలో చైతన్యం నింపడమే లక్ష్యం..!

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను జనంలోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం నింపడమే ప్రధాన లక్ష్యంగా ఈ యాత్ర ప్రారంభం కానుంది. బీజేపీ అవలంభిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు, మతసామరస్యానికి తూట్లు పొడవడం, ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడుతోంది. మరోపక్క సామాజిక న్యాయం కోసం సమరం సాగించాలని పార్టీ భావిస్తోంది. పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నీరుగార్చే ప్రయత్నం చేయడం, ప్రజాస్వామ్య హక్కులను హరించేలా వ్యవహరించడం, ప్రజల మధ్య నిరంతరం చీలికలు తీసుకురావడం వంటి చర్యలకు పూనుకుంటోంది. దేశ సంపదను కార్పొరేట్ల చేతిలో పెడుతూ ప్రజలను వంచనకు గురిచేస్తోంది. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిన కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ నిర్ణయించింది. వీటిపై ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగనుంది.

హాజరుకానున్న బీవీ రాఘవులు

ఆదిలాబాద్ జిల్లాలో గురువారం ప్రారంభం కానున్న ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య నేతృత్వం వహించనుండగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు హాజరై ప్రారంభించనున్నారు. ఇది వరకు 2006లో రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పార్టీ పాదయాత్ర చేపట్టింది. ఈ యాత్ర ముగింపు సభకు బీవీ.రాఘవులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జన చైతన్య యాత్రను ప్రారంభించేందుకు తొలిసారి ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. జాతీయ స్థాయి నాయకుడు హాజరుకానుండటంతో పార్టీ శ్రేణులు ఈ పర్యటనపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. నాయకులు, కార్యకర్తలు ఈ యాత్రను దిగ్విజయం చేసేందుకు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఎర్రజెండాలతో అలంకరణ చేశారు. దారి పొడవునా జెండాలు కట్టడంతో ఆదిలాబాద్ పట్టణం ఎరుపెక్కింది.

యాత్ర సాగుతోందిలా..!



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపడుతున్న జనచైతన్య యాత్ర ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల పాటు సాగనుంది. ఈ నెల 23న ఉదయం 10గంటలకు ఆదిలాబాద్‌లో ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభమవుతుంది. 11గంటలకు స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట బహిరంగ సభ ఉంటుంది. ఇది ముగియగానే పట్టణ శివారులో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పరిశ్రమను సాయంత్రం 4గంటలకు బీవీ.రాఘవులు సందర్శించనున్నారు. అనంతరం యాత్ర ఇక్కడ్నుంచి సాయంత్రం 5గంటలకు నిర్మల్‌కు చేరుకుంటుంది. అక్కడ సభ నిర్వహించడంతో పాటు నాయకులు అక్కడే బస చేయనున్నారు. ఈ నెల 24న ఉదయం 9గంటలకు నిర్మల్ నుంచి బయలుదేరి ఉదయం 11.30గంటలకు ఉట్నూర్‌కు చేరుకుంటుంది. అక్కడ విలేకరుల సమావేశం ఉంటుంది. ఇక్కడ్నుంచి నేరుగా సాయంత్రం 4గంటలకు ఆసిఫాబాద్‌కు చేరుకుంటుంది. అక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అదే రోజు సాయంత్రం 6గంటలకు కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకుంటుంది. అక్కడ సభ నిర్వహించడంతో పాటు రాత్రి అక్కడే నాయకులు బస చేస్తారు. 25న ఉదయం 10గంటలకు మంచిర్యాలకు చేరుకుంటుంది. ఇక్కడ బహిరంగసభ ఉంటుంది. అనంతరం ఈ యాత్ర మధ్యాహ్నం 12గంటలకు పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనిలోకి ప్రవేశిస్తుంది.

జిల్లాకు బీజేపీ అన్యాయం చేస్తోంది : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి



ఆదిలాబాద్ జిల్లాకు బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తోంది. సీసీఐని తెరిపించేందుకు సాధన కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేసినా స్పందించడం లేదు. ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టకపోవడం, విమానాశ్రయం, సెంట్రల్ యూనివర్సిటీ మంజూరు చేయకపోవడంతో జిల్లాకు నష్టం చేకూరుస్తోంది. ప్రజలు ఇక్కడ బీజేపీ ఎంపీని సైతం గెలిపించారు. కానీ ఆ పార్టీ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోంది. జనాన్ని చైతన్యం చేసేందుకు చేపడుతున్న ఈ యాత్రలో ప్రజాస్వామిక వాదులు, మేధావులు, లౌకికవాదులు, ప్రజలు భాగస్వాములు కావాలి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి.

షెడ్ నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పట్టణంలోని దస్నాపూర్‌లోనీ శ్రీ రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న షెడ్ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. షెడ్ నిర్మాణ పనులను ప్రారంభించి స్థానికులతో పలు అంశాలపై చర్చించారు. స్థానికులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శోభకృత నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభమే కలగాలని ఆకాంక్షించారు. నూతన ఏడాది ప్రజలంతా ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ప్రార్తిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం కెసిఆర్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలు పాటు పడుతోందని తెలిపారు. రానున్న రోజుల్లోనూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల అజయ్, నాయకులు భరత్, పార్వతి, ఐలయ్య దివిటి రాజు, అనిల్ పాల్గొన్నారు.

ఉగాది నుండి నూతనోత్సాహంతో పనిచేయాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వేడుకలకు బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై దీపాలంకరణ చేశారు. చైర్మన్ ఎం శ్రీధర్ కరపత్రాల రూపంలో పంపించిన సందేశాన్ని ఉద్యోగులకు చదివి వినిపించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు కోసం ఈ ఉగాది నుండే సన్నద్ధం కావాలని కోరారు. రక్షణకు మొదటి ప్రాధాన్యతనిస్తూ ఓ వైపు కుటుంబం, మరో వైపు సింగరేణి సంస్థ అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. బెల్లంపల్లి ఏరియా రాబోయే కొత్త ఉపరితల గనులతో రాష్ట్రంలోనే అధిక ఉత్పత్తి సాధించే ఏరియాగా అవతరించనుందన్నారు. అనంతరం ఉద్యోగులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కెహెచ్ఎన్ గుప్తా, టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఏజీఎం ఎం తిరుమలరావు, డీజీఎం(సివిల్) ఆర్ సతీష్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఎఫ్అండ్ఎ) రామారావు, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలను బుధవారం సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనిత ఎమ్మెల్యేకు పలు సమస్యలను విన్నవించారు. కళాశాల అభివృద్ధికి మరికొన్ని నిధులు కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసాని ఇచ్చారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కృంగి జీవితం మీద విరక్తి చెంది వ్యక్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..సీతారాంపల్లి గ్రామానికి చెందిన సిరిమిల్ల జీవన్(35) సెంట్రింగ్ కూలి పని చేస్తుండేవాడు. 15 సంవత్సరాల క్రితం వివాహం జరగగా, భార్య కూతురుతో కలిసి సీతారాంపల్లి నివసిస్తున్నాడు. కొంతకాలం నుండి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. కూతురు చదువు, భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ మానసికంగా కృంగిపోయాడు. రెండు రోజుల క్రితం ఫోన్ ఇంట్లో పెట్టి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. భర్త కనిపించట్లేదని భార్య మంగళవారం ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం సీతారాంపల్లి శివారు గోదావరిలో జాలర్లకు మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య ఫిర్యాదు మేర కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ - రెబ్బెన

గోలేటిలోని సింగరేణి స్కూల్ మైదానంలో బెల్లంపల్లి ఏరియాలోని ఆర్అండ్ఆర్ సెంటర్ల క్రీడాకారులకు గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు జీఎం దేవేందర్ తెలిపారు. ఉదయం 9గంటల నుండి సాయంత్రం వరకు ఈ పోటీలు కొనసాగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు, యువకులు పాల్గొనాలని కోరారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

- ఈ ఏడాది చిరుధాన్యాల సాగు పెంచుతాం
- నకిలీ విత్తనాల బెడదను అరికడతాం
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయంలో అన్నదాతలకు అన్ని వేళలా అండగా ఉంటూ అవసరమైన ప్రయోజనాలు కల్పిస్తామని జిల్లా వ్యవసాయశాఖాధికారి పుల్లయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ ఈ పంటల సాగును పెంచేలా చర్యలు చేపడుతామని వివరించారు.వీటితో పాటు సేంద్రీయ పంటల సాగును కూడా ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ ఏడాది రైతులకు నకిలీ విత్తనాల బెడద లేకుండా ముందస్తుగానే టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటుచేసి అరికట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో 2023 ఏడాదిలో చేపడుతున్న వ్యవసాయ ప్రణాళికపై నవతెలంగాణతో ముచ్చటించారు.

జిల్లాలో 5.66 ఎకరాల్లో సాగు

ఆదిలాబాద్ జిల్లాలో 2023 ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 5.66లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అంచనా వేస్తున్నాం. ఇందులో పత్తి 3.57లక్షల ఎకరాలు, సోయాబీన్ 1.32లక్షల ఎకరాలు, కందులు 66వేల ఎకరాలతో పాటు మిగితా పంటలు సాగవుతాయి. వీటికి అవసరమైన విత్తనాలను ఆయా కంపెనీలతో మాట్లాడి ముందుగానే అందుబాటులో ఉంచుతాం. జిల్లాలో అవసరమైన 1.18లక్షల టన్నుల ఎరువులను కూడా అందుబాటులో ఉంచుతాం. డీఏపీ 43వేల టన్నులు, యూరియా 18వేలు, కాంప్లెక్స్ ఎరువులు 42వేలు, పొటాష్ 9వేలు, సూపర్ 5వేల టన్నులు అవసరమవుతాయి.

చిరుధాన్యాల సాగును పెంచుతాం

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఇందుకనుగుణంగా జిల్లాలోనూ ఈ సాగును పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. కనీసం 45వేల ఎకరాల్లో కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు తదితర పంటలు వేసేందుకు రైతులకు అవగాహన కల్పిస్తాం. వీటితో పాటు జిల్లాలోని ప్రతి క్లస్టర్‌లో 25 ఎకరాల వరకు సేంద్రీయ పంటల సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహిస్తాం. పంటల ఉత్పత్తిని పెంచేలా ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. ముఖ్యంగా ఈ ఏడాది యాసంగిలో 1.60లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. కానీ రానున్న యాసంగి సీజన్‌లో ఈ పంటల సాగును 2.30లక్షల ఎకరాలకు పెంచాలని భావిస్తున్నాం.

నకిలీ విత్తనాలు అరికడతాం

ఈ ఏడాది నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రణాళిక రూపొందించాం. మే నెలలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటుచేసి జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపడుతాం. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టి రైతులకు అవగాహన కల్పిస్తాం. ముఖ్యంగా ప్రతి మంగళ, శుక్రవారాల్లో రైతువేదికల ద్వారా ఏఈఓలు రైతులకు నకిలీ విత్తనాల గుర్తింపు, పంటల సాగులో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. నూతన సంవత్సరంలో రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారాలని ఆకాంక్షిస్తున్నాను.

ఎమ్మెల్యే జన చైతన్య యాత్ర కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపడుతున్న జనచైతన్య యాత్ర కరపత్రాలను ఎమ్మెల్యే ఆత్రం సక్కు తన క్యాంపు కార్యాలయంలో నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) చేపడుతున్న జనచైతన్య యాత్రకు తన మద్దతు ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటంలో సీపీఐ(ఎం) ముందు వరుసలో ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్, దుర్గం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రయివేటీకరణను విరమించుకోవాలని వినతి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీలో ప్రయివేటు గుత్తేదారులతో బొగ్గును తీయించే ప్రయత్నాన్ని యాజమాన్యం విరమించుకోవాలని టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, డీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కైరిగూడ ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజర్ ప్రకాష్‌రావు, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఐఎన్‌టీయూసీ నాయకులు అడిగొప్పుల స్వామి, డీఎంఎస్ ఏరియా నాయకులు తిరుపతి మాట్లాడుతూ కైరిగూడ ఓసీపీలో సింగరేణి ఉద్యోగులకు బదులు గుత్తేదారులతో బొగ్గు తీయడానికి ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. బొగ్గును తీయడానికి కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారులు అన్ని రకాల హెచ్ఈఎంఎస్(హెవీ ఎర్త్ మూవింగ్ మిషనరీ) యంత్రాలు బొగ్గు పేస్‌ను అందుబాటులో ఉంచకపోవడతో లక్ష్య సాధనలో వెనుకబడినట్టు పేర్కొన్నారు. ఇప్పటికైనా హాల్‌రోడ్స్ యంత్రాలు, తగినంత మంది కార్మికులకు పనిచేసే పరిస్థితులను కల్పిస్తే కైరిగూడ ఓసీపీకి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వెంకటేశం, రాజేష్, కె.వెంకటేశం పాల్గొన్నారు.


అలరించిన కుస్తీ పోటీలు



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. విఠలేశ్వర్ ఆలయంలో విఠల్ రుక్మిణి విగ్రహాలకు పూజలు నిర్వహించి అక్కడి నుంచి భాజాభజంత్రీలతో వివేకానంద విగ్రహ సమీపం వరకు చేరుకున్నారు. అక్కడ కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. మొదటి కుస్తీ టెంకాయతో ప్రారంభించి చివరి 5000 వరకు కుస్తీ పోటీలు కొనసాగాయి. ఈ పోటీలో పాల్గొనేందుకు మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, హిమాయత్‌నగర్‌తో పాటు తెలంగాణలోని తానూర్, భైంసా, ముధోల్, కుంటల తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మల్లయోధులు హాజరయ్యారు. పోటీలను తిలకించడానికి మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గెలుపొందిన మల్లయోధులకు మొదటి బహుమతి రూ.5001, రెండో బహుమతి రూ.3001 సర్పంచ్ మీరా విజయ్‌కుమార్, గ్రామ పెద్దలు బోయిడి విఠల్, పుప్పల పీరాజి, ఆలయ కమిటీ అధ్యక్షుడు నారా పరుశురాం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహినొద్దీన్, అనిల్, నగేష్, సూది రాజన్న పాల్గొన్నారు.

'చెట్టు తల్లి' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లాకు చెందిన బొల్లారం బాబన్న రచించిన చెట్టు తల్లి కవితా సంపుటిని ప్రసిద్ధ కవి తెలుగు విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.గోపి బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ కవులంటే తనకు అంతులేని ప్రేమాభిమానాలని, ఇక్కడి కవుల కవిత్వం అడివంత సహజ సిద్ధంగా ఉంటుందని కొనియాడారు. బాబన్నకు కవిత్వంలో ఇది తొలి అడుగు అయినా సరే ఆయనకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉదారి నారాయణ పాల్గొన్నారు.

పల్లకి ఊరేగింపు

కౌటాల : మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని నరేంద్రబాబా పల్లకిని ఊరేగించారు. అనంతరం హనుమాన్ మందిర్ వద్ద బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఉగాది పచ్చడ పంపిణీ చేసి పంచాంగ పఠనం చేశారు. నరేంద్రబాబా కమిటీ సభ్యులు, ఉప సర్పంచ్ చాప్లె లహంచు పటేల్, బూషి పోశం పాల్గొన్నారు.


ఉగాది సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కవి సమ్మేళనంలో కవిత వినిపిస్తున్న ఆదిలాబాద్ కవి డాక్టర్ ఉదారి నారాయణ

ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని కజ్జర్ల గ్రామంలో మార్చి 25న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరిశీలించారు. ఆత్మీయ సమ్మేళనం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మండల నాయకులకు సూచించారు. సభ ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, స్థానిక ఉప సర్పంచ్ కాకర్ల ప్రశాంత్, పెద్ద చింతలపెల్లి దేవారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుభాష్, మున్న, మల్లేష్‌యాదవ్ ఉన్నారు.

ఘనంగా శోభకృత్ నామ ఉగాది వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



జిల్లా కేంద్రంలోని రామచంద్ర గోపాలకృష్ణ మఠంలోఉగాది వేడుకలు బుధవారం శోభాయామానంగా జరిగాయి. సనాతన హిందూ ఉత్సవ సమితి, రామకృష్ణ సేవా సమితి ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొన్నారు. భాజా భజంత్రీల నడుమ స్వాగతం పలికిన నిర్వాహకులు దగ్గరుండి ఎమ్మెల్యేతో పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారికి ముఖ్యమైన పండగ ఉగాది అని, ఆ రోజున పంచాంగ శ్రవణం విని, షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి తినడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. శోభకృత నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రజల జీవితాలు శోభాయమానంగా ఉండాలని ఆకాంక్షించారు. మఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డిఎస్‌పి ఉమేందర్, సనాతన హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు ప్రఫుల్ వజే, అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, అశోక్ స్వామి, సభ్యులు మాధవ్, నర్సా గౌడ్, సూర్యకాంత్, బండారి దేవన్న పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని వడ్డెర కాలలోని హనుమాన్ మందిరంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ పాల్గొని పూజలు చేశారు. ఈ శోభకృత్ నామ సంవత్సరం అందరి జీవితాల్లో సుఖ శాంతులు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. అంతరం కాలనీ వాసులు పాయల్ శంకర్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆకుల ప్రవీణ్, రత్నాకర్‌రెడ్డి, మేస్రం కృష్ణ, శంకర్, సాయి, నవీన్, నారాయణ్, పాల్గొన్నారు.

ఉట్నూర్ : ఉగాది పండుగ వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. రైతులు ఉగాది పండుగ సందర్భంగా తెల్లవారుజామునే ఇంట్లో పూజలు చేసి వ్యవసాయ భూముల్లో పనులు ప్రారంభించారు. ఉగాది పచ్చడిని స్వీకరించారు. పలు దేవాలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో, కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని లక్కారంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. లక్కారంలో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్పి చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ హాజరై కుమ్మరి సంఘ నాయకులకు, ప్రజలకు పచ్చడిని అందించారు.

బాసర : సరస్వతిదేవి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సరస్వతికి ఆలయ అర్చకులు, వేద పండితులు వేకువ జామున ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని రిమ్మ, పోచంపల్లి, సుంకిడి, రాయిగూడ, పొన్న, సొంపల్లి, రాంపూర్, వాయిపేట్ తదితర గ్రామాలలో బుధవారం ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున నిద్ర లేచి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులంతా కలిసి ఆరు రుచులతో కలిగిన ఉగాది పచ్చడిని సేవించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పంట పొలాల్లోకి వెళ్లి పూజలు చేసి వ్యవసాయ పనులను ప్రారంభించారు.

నార్నూర్ : ఉమ్మడి మండల కేంద్రంతో పాటు మాన్కాపూర్, తాడిహత్నూర్, నాగలకొండ, మహాగావ్ తదితర ఆదివాసీ గిరిజన గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఇంట్లో ఉగాది పచ్చడి తయారు చేసుకున్నారు. తెల్లవారుజామున పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రజలు పంచాంగ శ్రవణం విన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్ మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

తాంసి : తాంసి, భీంపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువజామున ఇంట్లో వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించి పంట పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు ప్రారంభించారు. వెంట తీసుకెళ్లిన పెరుగన్నం తిని మామిడి ఆకులు, మామిడి కాయలు ఇంటికి తీసుకొచ్చి పచ్చడి తయారు చేసుకున్నారు.

లక్ష్మణచాంద : ఉగాది పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పొట్టపెల్లి-కె గ్రామంలో చిన్నారులు ఇంటింటికి తిరుగుతూ ఉగాది పచ్చడి పంచుతూ శుభాకాంక్షలు తెలియజేసారు. ఆట పాటలతో అలరించారు. చిన్నారులను గ్రామస్తులు అభినందించారు. వడ్యాల గ్రామంలో రామాలయం వద్ద పందిరి వేసి గ్రామస్తులు సంబరాలు జరుపుకున్నారు.

కౌటాల : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శోభకృత్ నామ ఉగాది పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని సదాశివ్‌పేట్ శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అంబేద శంకరయ్య, సంతోష్, బోలాల విఘ్నేష్‌చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా నిర్వహించి శివుడికి, సీతారామ లక్ష్మణులకు అభిషేకం, దీపారాధన చేశారు. ఆలయ ముఖద్వారం వద్ద మంగళ వాయిద్యాలతో ధ్వజారోహణ, శివపార్వతుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి నూతన సంవత్సర పంచాంగ పఠనం చేశారు. అదేవిధంగా మండలంలోని రైతులు వారి పశువులను పూజించి పంట చేనులో వ్యవసాయ పనులను ప్రారంభించుకున్నారు.

ఆసిఫాబాద్ : ఉగాది పండుగను పురస్కరించుకొని రైతులు అరక పట్టి పొలం పనులు ప్రారంభించారు. మండలంలోని మోతుగూడలో రైతులు ఉగాది పండుగ పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, వ్యవసాయ పనులు ప్రారంభించి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జానకిరామ్ రైతులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు ఉదయం నుండి ప్రతి ఇంట్లో ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసుకున్నారు. ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి చేనులోకి వెళ్లి భూమి పూజ చేసి నాగళ్లతో వ్యవసాయ పనులు ప్రారంభించారు. పంటలు బాగా పండి అందరూ సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నారు. సాయంత్రం వేళ హనుమాన్ దేవాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఒకరికొంకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రెబ్బెన : మండలంలోని సీతారామాంజనేయ దేవాలయంలో మండల ప్రజా ప్రతినిధులు, హనుమాన్ దీక్షాపరులు ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, హనుమాన్ దీక్షాపరులు, ప్రజలు పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకొని గోలేటిలోని శ్రీ కోదండ రామాలయం ఆవరణలో హనుమాన్, ఓంకార జెండాలను పంపిణీ చేశారు. అనంతరం గోలేటిలోని బస్టాండ్ ప్రాంగణంలోనూ జెండాలను పంపిణీ చేశారు.

పెంచికల్‌పేట్ : ఉగాది పర్వదినాన్ని గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంటిలో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు. ఎలుకపెల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. సంజీవ్‌నగర్ గ్రామంలో గల శివాలయంలో పురోహితుడు మూలపతం దేవేందర్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం పఠించారు.

ఆసిఫాబాద్ : ఉగాది పండుగలో పచ్చడి వలె షడ్రుచుల సమ్మిళితంగా జీవితాలు ఉండాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయం ఎదుట బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రత్యేకంగా తయారు చేసిన ఉగాది పచ్చడిని ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగను ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలకు మంచి మద్దతు ధర ఉండాలని వరి, పాడి పశు సంపద అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, జిల్లా కార్యదర్శి మిట్ట తిరుపతి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంజయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ సాయికృష్ణ, ఆరే సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, మేరు సంఘం జిల్లా నాయకుడు రాపర్తి నరేష్, తేలి సంఘం నాయకుడు మెంగ్రే బాబురావు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరాలయంలో ఉగాది వేడుకలు

జన్నారం : మండలంలోని రాంపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీశోభకృత్ నామ సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలే కలగాలని శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పంచాంగ శ్రవణాన్ని పఠించారు. ఉగాది పండుగ సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు.

రామకృష్ణాపూర్ : మందమర్రి మండలంలో జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉగాది పచ్చడి డాక్టర్ రాజా రమేష్ కూతురు వైష్ణవి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా రమేష్ యూత్ నాయకుడు హరీష్ మాట్లాడుతూ ముందుగా మందమర్రి పట్టణ ప్రజలకు, సింగరేణి పరిసర ప్రాంతాలలో ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. చలి వెంద్రం ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజలకు ఎండాకాలంలో దాహం తీర్చడం చాలా సంతోషంగా ఉందని, అలాగే ఈ రోజు ఉగాది పచ్చడి పంపిణీ చెయ్యడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా రమేష్ మిత్రబందం ఉప్పలపు సురేష్, ప్రకాష్, కిరణ్ కుమార్, సేవాదళ్ పాషా, మందమర్రి యూత్ హరీష్, శ్రావణ్, రాజు, రాము, పాల్గొన్నారు.

నస్పూర్ : శోభాకృత్ నామ నూతన సంవత్సరాది(ఉగాది)ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఆర్పీ-3,3ఏ గనిలో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ దంపతులు, శ్రీరాంపూర్ ఉపరితల గనిలో కాలరీ మేనేజర్ వీరయ్య, ఆర్కె7 గనిలో గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ, గని మేనేజర్ సాయిప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాసిపేట : మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే లేచి స్నానాలు ఆచరించి ఇళ్లకు మామిడితోరణాలు, పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడి స్వీకరించారు. పిండి వంటకాలు, బూరెలు, స్వీట్లు చేసుకున్నారు. ఒకరికి ఒకరు ఉగాధి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. స్థానికంగా ఉన్న దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

కాగజ్‌నగర్ : తెలుగువారందరికీ ఉగాది పర్వదినంతో నూతన సంవత్సరం ఆరంభమవుతుందని పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఓల్డ్ కాలనీ ఉమామహేశ్వర మార్కండేయ దేవాలయంలో బుధవారం శోభకృత నామ నూతన సంవత్సర కాల సూచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పరికిపండ్ల కరుణాకర్ ను సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్ కుమార్, గౌరవ అధ్యక్షులు కటుకం మధుకర్, గడదాసు నారాయణ, బూర సమ్మయ్య, ఉపాధ్యక్షులు పడాల రాజయ్య, సదానందం, పాల్గొన్నారు.


సిరికొండలో..


ఉట్నూర్‌లో..


ఆసిఫాబాద్‌లో..


ఇచ్చోడలో..

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-తలమడుగు

కప్పర్‌దేవి గ్రామంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఉమ్‌డం జట్టుకు రూ.30వేలు త్రియంబక్, రెండవ బహుమతి కోసాయి జట్టుకు రూ.25వేలు జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, మూడవ బహుమతి భరంపూర్ జట్టుకు ఎంపీటీసీ హనుమంతు రూ.20వేలు, నాలుగవ బహుమతి సకినాపూర్ జట్టుకు సందీప్ రూ.15వేలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, సర్పంచ్ రఘు, ఎంపీటీసీలు హనుమంతు, వెంకన్న యాదవ్, త్రయంబక్, శ్రీనివాస్, పటేల్, ఉప సర్పంచ్ దేవరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉగాది రోజు మొసలి భయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఉగాది పర్వదినాన పలువురికి మొసలి భయం పట్టుకుంది. మండలంలోని మునిపెల్లి గ్రామంలో గల గోదావరినది పుష్కర ఘాట్‌ను ఆనుకొని ఉన్న లింగాల మడుగులో మొసలి కలకలం రేపింది. ఉగాది సందర్భంగా గోదావరి స్నానం చేయాడానికి వచ్చిన వారికి మొసలి బండరాయి మీద నుండి నీటిలోకి దూకిన దృశ్యం కంటపడింది. దీంతో నీటిలో ఉన్నవారంత భయంతో గోదావరి గట్టుకు వచ్చారు. అటవీ శాఖ అధికారులు స్పందించి మొసలిని పట్టుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. లేదంటే ప్రాణాపాయం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రతి పండగకు లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, మల్లాపూర్, మాచాపూర్, మునిపెల్లి గ్రామల ప్రజలు ఈ మడుగులోనే స్నానం చేస్తారని, ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు

డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు బుధవారం రుయ్యాడి గ్రామంలో ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చిలుకూరి సమతారెడ్డి మాట్లాడుతూ కుట్టు మిషన్ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, సర్పంచ్ పోతారెడ్డి, డ్రీమ్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ కుమ్ర జంగుబాబు, నిట్యాడి అశోక్, వెంకన్న యాదవ్, గంగారెడ్డి, ఉడుగు రాకేష్, బాలాజీ, కె.వెంకటేష్ గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని ఈజ్‌గాం చౌరస్తాలో వాసవి ట్రేడర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, సర్పంచ్ బొట్లకుంట మల్లేష్, ఎంపీటీసీ అరికిల్ల కుమార్, వ్యాపారులు పుల్లూరి శ్రీనివాస్, కొల్లేటి శివప్రసాద్ పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో యువకుడి రక్తదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడకు చెందిన ఆదివాసీ మహిళ జంగుబాయి రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. రక్తహీనతతో బాధపడుతున్న ఆమెకు బి-పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓరుగంటి అఖిల్ రిమ్స్ రక్త నిధి కేంద్రంలో రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నాడు. అత్యవసర సమయంలో రక్తదానం చేసిన యువకుడికి మహిళా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

శ్రీరామనవమి శోభాయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం రామనవమి సందర్భంగా భారీ ఎత్తున ర్యాలీ చేపడుతున్నట్లు శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యుడు రాళ్ల బండి మహేందర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని గోపాలకృష్ణ మఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సర్వసతితో కలిసి శ్రీరామనవమి శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 30న సాయంత్రం 4గంటలకు పట్టణంలోని గోపాలకృష్ణ మఠం నుండి శోభాయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ శోభాయాత్రకు హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యులు గంద్రత్ మహేందర్, సురేందర్, నిఖిల్, రాకేష్, అర్జున్ పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ విరాళం

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని సాయిబాబ ఆలయానికి శిర్షా గ్రామానికి చెందిన దాన్ల మల్లేష్, నిర్మల్ పట్టణానికి చెందిన కనకాల శంకర్ మైక్ సెట్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మల్లొజ్జుల చంద్రశేఖర్ శర్మ విరాళం అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్‌పంపు ప్రారంభం

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలో రెబ్బిమ సర్కార్ పెట్రోల్ పంపును జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో పెట్రోల్‌పంపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డీజిల్, పెట్రోల్ అందుబాటులో లేకుంటే సిర్పూర్, కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సి వచ్చేదని, అలాంటిది అందుబాటులో ఉండడం వాహనదారులకు లాభదాయకమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, నాయకులు విలాస్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, నహీంహైమద్, డోంగ్రె మధుకర్ పాల్గొన్నారు.

విగ్రహా ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గంగాపూర్ గ్రామంలో బుధవారం లంబాడాల బంజారాల ఆరాధ్య దైవం సంత్ తపస్వి రామ్ రావు మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ హాజరయ్యారు. ముందుగా దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో విగ్రహా ప్రతిష్ఠాపన మహ భోగ్ భండార్ నిర్వహించారు. కార్యక్రమంలో టీజీఓ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మన్ ఆడే సురేష్, సర్పంచులు రుపదేవ్, గజానంద్ నాయక్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, లంబాడి జేఏసీ జిల్లా సలహాదారులు రాథోడ్ నారాయణ్, పవార్ దేవిదాష్, లైవ్ లంబాడి నాయకులు నరహరి దాస్, యశ్వంత్‌రావ్ పాల్గొన్నారు.

పోరాటయోధుల వర్ధంతి సభలు విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 92వ వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో భగత్ సింగ్ 92వ వర్ధంతి సభ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 23న భగత్ సింగ్, రాజగురు, సుఖదేవుల 92వ వర్ధంతి సందర్భంగా దేశంలో జరుగుతున్న మత విద్వేష, ఉన్మాద దాడులకు వ్యతిరేక పోరాట నినాదంతో వర్ధంతి సభలు జరుపుకోవాలన్నారు. వలస పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ భారతీయ సమాజానికి ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదం ఇచ్చి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో వనుకు పుట్టించిన విప్లవ యోదులను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత విద్వేశాలను రూపుమాపాలన్నారు. నేడు దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మతతత్వ విధానమేనని దేశంలో మతవిద్వేషాలను పెంచి పోషిస్తూ ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం మోపుతూ ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తూనే తిరిగి భగత్ సింగ్‌కు నిజమైన వారసులం మేమే అంటూ ముందు వరసలోకి వస్తున్న అభివృద్ధినిరోధకుల మతతత్వ శక్తుల పన్నాగాలను తిప్పికొట్టేందుకు నేటి విద్యార్థి యువతరం ముందుకు రావాలని ఆ స్ఫూర్తితోనే జరిగే భగత్ సింగ్ రాజగురు, సుఖదేవుల వర్ధంతి సభలలో విద్యార్థి-యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి గోలేటి ప్రదీప్, జిల్లా నాయకులు భరత్, సాయి, శ్రీశైలం, హాస్టల్ కమిటీ సభ్యులు అజయ్, శివ, వంశీ, వరప్రసాద్ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఉట్నూర్

అడవి పంది దాడిలో ఒకరికి తీవ్ర గాయలైన సంఘటన మండలంలో జరిగింది. మండలంలోని పాత ఉట్నూర్‌కు చెందిన డోలి మల్లేష్ ఉగాది పండుగ సందర్భంగా బుధవారం వ్యవసాయ పొలాల్లో పూజలు చేసి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో అడవి పంది అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గాయపడ్డా అతనిని అటుగా వెళ్లే వ్యవసాయదారులు గమనించి సమాచారం ఇవ్వటంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించారు.

కెరమెరికి చేరుకున్న బట్టి పాదయాత్ర

నవతెలంగాణ-కెరమెరి

హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేపట్టి పాదయాత్ర మంగళవారం రాత్రి కెరమెరికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ సర్వసాధారణమని మాట్లాడిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంత్రిగా ఉండటానికి అర్హత లేదని విమర్శించారు. అయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకునే వరకు రాష్ట్రంలో ఎక్కడ తిరగకుండా యువత నిరుద్యోగులు అడ్డగించాలన్నారు. కొలువుల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో లేక లేక నోటిఫికేషన్ జారీ చేసి, ప్రశ్నాపత్రం లీకేజీ చేసి వాళ్లకు కావాల్సిన వారికి అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన స్థానిక ఎమ్మెల్యే సక్కు రాత్రికి రాత్రే పార్టీ మారి నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గిరిజనుల సమస్యలపట్ల పోరాటం చేస్తానని ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గ ప్రజలను మోసం చేశారు. రాత్రి ఝరి గ్రామంలో బస చేశారు. బుధవారం బారేమోడీ గ్రామంలో రైతులతో కలిసి ఆరుకోవడం (ఏరువాక) కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి, ఇక్కడి రైతుల ఆచార, సాంప్రదాయం ప్రకారం ఉగాది రోజున వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ఎద్దులకు, నాగలికి చేసే పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

గిరిజనులు ఆత్మగౌరవంతో బతకాలి

గిరిజనులు ఆత్మగౌరవంతో బతకాలని యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ నాయకత్వంలో తీసుకువచ్చిన అటవీ హక్కుల చట్టం ద్వారా భూపట్టాల పంపిణీ కాంగ్రెస్ హయాంలో చేసినట్టు గుర్తు చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 476 గ్రామాలకు శుద్ధి చేసిన మంచినీటి జలాలు



అందించడానికి 2009 జూలై 19 ఆదివారం రోజున ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఝరి గ్రామాన్ని వేదికగా చేసుకున్నారని తెలిపారు.చారిత్రాత్మకమైన రెండు సంఘటనలకి వేదికైన ఝరి గ్రామంలో వారిని గుర్తు చేసుకుంటూ ఉగాది ఉత్సవాల నిర్వహించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. బారేమోడీ గ్రామంలో వెంకట్రావు వ్యవసాయ పొలంలో ఆరు కోవడం (ఏరువాక) సందర్భంగా ఎద్దులకు పూజలు చేసి నాగలి పట్టుకొని తొలిదుక్కి దున్నారు. వారు తీసుకొచ్చిన జొన్న గట్క నైవేద్యాన్ని భుజించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావ్, నాయకులు విశ్వ ప్రసాద్, గణేష్ నాయక్, సరస్వతి, కుసుం రావు, సుదర్శన్, పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ యూనిట్ ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-8 డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ యూనిట్‌ను బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధా కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ ఫిజియోథెరపీ యూనిట్‌ను ప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. ఉద్యోగులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని, మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుం నొప్పి ఉన్నటువంటి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఈ ఫిజియోథెరపీ యూనిట్ కి వచ్చి ఫిజియోథెరపీ చేసుకోవాలని సూచించారు. త్వరగా ఫిజియోథెరపీ యూనిట్‌ను ప్రారంభించినందుకు గాను డాక్టర్ పి.రమేష్ బాబుని, వైద్య సిబ్బందిని జనరల్ మేనేజర్ అభినందించారు. సుమారు రూ.పది లక్షల వ్యయంతో పరికరములను ఈ ఫిజియోథెరపీ యూనిట్‌లో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, డీజీఎం పర్సనల్ అరవింద రావు, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తమ రెడ్డి, డీజీఎం సివిల్ శివ రావు, డీజిఎం ఏరియా స్టోర్స్ సోమశేఖర్, ఇన్‌ఛార్జి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పర్చేస్ ఎస్ఈ చంద్రశేఖర్, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ శ్రీనివాస్, డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ మురళీధర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, డాక్టర్ స్వప్న, పిట్ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 23 మార్చి 2023

చిన్నారికి అండగా పోడేటి ట్రస్ట్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని ఉత్కూర్‌కు చెందిన దర్శనాల బ్రహ్మనిత అనే చిన్నారి కిడ్నీ వ్యాధితో బాధపడుతుందని తెలుసుకుని చికిత్స కోసం పోడేటి వెంకాగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సతీష్ రూ.10 వేల నగదును బుధవారం అందజేశారు. పాప తల్లి గతంలోనే మరణించగా తండ్రి సుధాకర్ కూలీ పని చేస్తూ ఇద్దరూ పిల్లలను పోషించుకుంటున్నాడు. కాగా మెరుగైన చికిత్స కోసం దాతలు సహాయం అందించాలని పాప తండ్రి కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వినయ్, శ్రీమాన్, కృష్ణ, సాయికిరణ్, సాయిరాం, శేఖర్, సాయి తేజ, ఆర్యాన్, దిలీప్ పాల్గొన్నారు.

నేడు సర్పంచులకు ప్రశంసా పత్రాల అందజేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని 29 గ్రామపంచాయతీలలో గతంలోనే జాతీయ పంచాయతీ అవార్డుల్లో భాగంగా మార్కుల ఆదారంగా సర్పంచ్‌లకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు ఎంపీడీఓ అరుణాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9 రకాల అంశములకు ఒక్కొక్క అంశం వారిగా ఎక్కువ మార్కులు వచ్చిన మూడు గ్రామపంచాయతీలకు గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే రేఖా నాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అవార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని 29 గ్రామపంచాయతీల సర్పంచులు ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

బీఎంఎస్ కృషితోనే సింగరేణిలో స్వచ్ఛమైన తాగునీరు

నవతెలంగాణ-నస్పూర్

బీఎంఎస్ పోరట ఫలితంగానే సింగరేణి కార్పోరేట్ యాజమాన్యం రామగుండం రీజియన్, బెల్లంపల్లి రీజియన్ కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారని ఎస్సీఎంకేఎస్(బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించుటకు గతంలో అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన సింగరేణి కోల్ మెన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) చేసిన ఆందోళన కార్యక్రమాలకు స్పందించిన యాజమాన్యం రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ (ఆర్జీఎఫ్) ఏర్పాటు చేయుటకు అంగీకారం తెలిపిన సింగరేణి కార్పొరేట్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం నూతన భవన నిర్మాణ పనులను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణాలో అన్ని సామాజిక వర్గాలకు సమ న్యాయం చేస్తూ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘంకు ప్రభుత్వం తరుపున కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్‌లు బోయిని తిరుపతి, సుమన్, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, మోటూరి వేణు, మద్దివేణి వేణు, అగ్గి సత్తయ్య, బుగ్గరాజు, లంక లక్ష్మణ్, ఉస్కమల్ల గోపాల్, రాపర్తి శ్రీనివాస్, నస్పూరి నర్సింగం, సత్రవేణి మల్లేశ్, మాజీ ఎంపీపీ సిలోజు కళావతి, సిలోజ్ మురళి, గొల్లపల్లి రాజేందర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సీఎం రిలీఫ్ నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పట్టణంలోని కాపువాడకు చెందిన అర్జున్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేసుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.30,000 చెక్కును బుధవారం కౌన్సిలర్ పిరిసింగుల జైచందర్‌తో కలిసి లబ్దిదారునికి అందజేశారు.

'నీటి కొరత ఆందోళన కలిగిస్తోంది'

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ప్రపంచం, దేశంలో నీటి కొరత ఆందోళన కలిగిస్తోందని రైట్ టూ హెల్త్ ఫోరం, ఆర్‌టీహెచ్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మోతె రాజలింగు అన్నారు. బుధవారం ప్రపంచ జల దినోత్సవం సందర్బంగా పట్టణంలోని జోడువంపులలోని హెల్త్ ఫోరమ్ కార్యాలయంలో మాట్లాడారు. జీవరాసులన్నింటికీ అత్యావసరమైన వాటిలో నీరు ఒకటని, దురదృష్టవశాత్తు కలుషితం కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని అన్నారు. వాన కురిసే ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి, సమర్థవంతంగా వినియోగించాలని, దీనికోసం విస్తతంగా అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలను పెంచినట్లయితే మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరికి సురక్షితమైన నీరు అందేలా స్థిరమైన పరిష్కారాలను ప్రభుత్వాలు కనుగొనాలని అన్నారు. నీటిని సేకరించడం, నిలువ చేసుకోవడంపై ప్రభుత్వాలు ప్రజల్లో అవగాహన కల్పించాలని, నీటి కొరత కారణంగా మినరల్ వాటర్ అమ్మకాలు నానాటికి విపరీతంగా పెరుగుతూ, మినరల్ వాటర్ కేంద్రాలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. నీటిని ఆదా చేయకపోతే రేపటి తరానికి నీటి భరోసా ఉండదన్నారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కార్యదర్శి గుమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం'



నవతెలంగాణ-రామకష్ణాపూర్

ఆర్‌కే-1ఏ గనిపై ఎస్సీడబ్ల్యూయూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం గని కార్మికుల సమస్యలు తెలుసుకుని యాజమాన్యంతో వెంటనే మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఏఐటీయూసీ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ పాల్గొని మాట్లాడారు. ముందుగా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్‌కే-1ఏ గని మూసివేయబడుతున్నందున కార్మికులు ఏఏ డిజిగ్నేషన్‌లలో యాక్టింగ్ చేస్తున్నారో, ఆయా ప్రమోషన్లు ఇచ్చిన తరువాతనే వేరే గనికి బదిలీ చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అలాగే దేశ స్వాతంత్ర్యం కోసం 23 సంవత్సరాల యువ వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన షాహిద్, భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్బంగా ఈ నెల 23వ తేదీన బెల్లంపల్లిలోని నెంబర్ 1 గ్రౌండ్ నుంచి భగత్ సింగ్ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం లో కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షులు ఇప్పకాయల లింగయ్య, ఫిట్ సెక్రటరీ సురమళ్ళ వినయ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గోవిందుల రమేష్, కమిటీ సభ్యులు సుంకరి గట్టయ్య, చెంద్రఖని రమేష్ పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లే దిక్కు..!

- ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్‌లో కలగానే మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆల్టింగ్
- దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తప్పని అవస్థలు
- జిల్లా ఏర్పాటైన తీరని అన్యాయం..పట్టించుకోని ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-రెబ్బెన

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏకైక రైల్వేస్టేషన్ రెబ్బెనలోని ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్. ఈ రైల్వేస్టేషన్‌కు ఘనమైన చరిత్ర ఉంది. నిజాం కాలంలో ఏర్పాటైన రైల్వేస్టేషన్ ఇది. అయితే ఇక్కడ నేటికి పూర్తిస్థాయి వసతులు కల్పించడంలేదు. జిల్లాకేంద్రంగా ఉన్నా ఆసిఫాబాద్‌తో పాటు సింగరేణి బొగ్గుగనుల ఏర్పాటుతో పాటు పారిశ్రామిక ప్రాంతంగా, జీఎం కార్యాలయం, పారిశ్రామిక ప్రాంతంగా మారిన గోలేటి, వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్, జైనూర్ మండలాలకు ఈ స్టేషనే పెద్ద దిక్కుగా ఉంటుంది. కానీ పాలకులు దీని అభివృద్ధి విషయంలో కానీ, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆల్టింగ్‌లో ఏమాత్రం దృష్టి సారించడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. నూతనంగా ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటైనా సౌకర్యాలు మాత్రం దరిచేరడం లేదు. ఈ జిల్లాలో మూడు రైల్వేస్టేషన్‌లు ఉండగా ఆసిఫాబాద్ ప్రయాణికులకు నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. పట్టించుకోవాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో సమస్యల పరిష్కారం కాక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఏండ్లు గడుస్తున్నా ప్రజలకు పాసింజర్ రైళ్లే దిక్కవుతున్నాయి.

అక్కడికి వెళ్లాల్సిందే..!

ఈ స్టేషన్ గుండా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే అటు కాగజ్‌నగర్, ఇటు బెల్లంపల్లికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆల్టింగ్ చేయాలని ప్రజా ప్రతినిధులకు, రైల్వే అధికారులు, రైల్వే జీఎంకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు పురోగతి లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి ఏదైనా ఉందంటే అది కేవలం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తికావడం ఒక్కటే జరిగింది. ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంగా ఏర్పాటైన తర్వాత సమీపంలోని ఈ రైల్వేస్టేషన్ రూపురేఖలు మారుతాయని ఎంతో ఆశపడిన ప్రయాణికులకు నిరాశే ఎదురవుతుంది. ఇక్కడి నుండి హైదరాబాద్, వరంగల్, కొత్తగూడెం, ఖమ్మం, విజయవాడ, తిరుపతికి, మహారాష్ట్రలోని చంద్రాపూర్, నాగ్‌పూర్ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోజుకు వందల సంఖ్యలో ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆల్టింగ్ లేకపోవడంతో ఇటు కాగజ్‌నగర్, బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసరమున్న వారు ప్యాసింజర్ రైళ్లలో ఇటు బల్లార్షా, చంద్రాపూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏదైనా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాల్సి వస్తే ఇటు ప్యాసింజర్ రైలు ఎక్కి బెల్లంపల్లి, మంచిర్యాల లేదా బల్లార్షాకు వెళ్లి అక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసిఫాబాద్ రైల్వేస్టేషన్‌లో కేవలం ఇంటర్‌సిటీ మినహా ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆల్టింగ్ లేదు. కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా ఆల్టింగ్ లేక బెల్లంపల్లికి వెళ్లి ఎక్కాల్సిన దుస్థితి ఉంది. అదేవిధంగా నాగ్‌పూర్ ప్యాసింజర్ ఇంతకు ముందు ఆల్టింగ్ ఉన్న రైళ్లు ఇప్పుడు అవి కూడా ఆల్టింగ్ తీసేసి ప్రయాణికులకు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి వస్తే రేచిని రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ ఆసిఫాబాద్ జిల్లా, బెల్లంపల్లి జీఎం కార్యాలయం ఏర్పడినా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడంలో అధికారులు విఫలమవుతున్నారు. గతంలో కొన్ని రైళ్లకు ఆల్టింగ్ ఇచ్చినా కూడా ప్రస్తుతం వాటిని కూడా తొలగించారు.

సౌకర్యాలు అంతంత మాత్రమే..!

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాల కల్పన కూడా అంతంత మాత్రమే ఉంది. వెయిటింగ్ గది లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులకు కనీస అవసరాలు తీర్చడానికి మహిళలకు, పురుషులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేని పరిస్థితి ఉంది. సింగరేణి బొగ్గుగని రవాణా ద్వారా రైల్వే శాఖకు నెలకు దాదాపు రూ.కోటి వరకు ఆదాయం వస్తుంది. అయినా రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేవు. అదేవిధంగా ఫ్లాట్‌ఫాంలో నిలబడడానికి గంటల తరబడి రైళ్ల కోసం నిలబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆల్టింగ్ ఇస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.



ఎలాంటి అభివృద్ధి లేదు

- రవి, కైరిగూడ



ఈ రైల్వేస్టేషన్‌లో ఎలాంటి అభివృద్ధి జరగడంలేదు. చాలా కష్టంగా ఉంది. దూరప్రాంతాల ప్రయాణం చేయాలంటే కాగజ్‌నగర్, బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆల్టింగ్ చేయాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేసిన ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదు. ప్రయాణికులు నిత్యం కష్టపడుతున్న పట్టించుకొనే వారే కరువయ్యారు. రైల్వే అధికారులకు ఈ విషయాన్ని పలుమార్లు ఫిర్యాదు చేశాం. అయినా స్పందించలేదు.

అధికారులు, నాయకులు వెంటనే స్పందించాలి

- ఉపేందర్, గోలేటి



ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్ సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు, నాయకులు వెంటనే స్పందించాలి. నియోజకవర్గంలో ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్ ఉన్నప్పటికీ సమస్యను పరిష్కరించడంలో ఎవరు శ్రద్ధ చూపడం లేదు. ఈ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆల్టింగ్ చేస్తే అన్ని సమస్యలు తీరుతాయి. అలాగే రైల్వే శాఖకు అధిక లాభం వస్తుంది. తత్కాల్ టికెట్లు బుకింగ్ చేయాలంటే ఇటు బెల్లంపల్లి కానీ, కాగజ్‌నగర్ కానీ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు మేల్కొని వెంటనే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆల్టింగ్ ఇచ్చే విధంగా చూడాలి. రైల్వేస్టేషన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆల్టింగ్ కోసం ఎదురుచూపులు

- విలాస్, తుంగెడ



ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆల్టింగ్ కోసం ఎదురుచూస్తున్నాం. రైల్వేస్టేషన్ ఉన్నా కూడా ప్రయోజనం లేదు. దూరప్రాంతాలకు వెళ్లాలంటే ప్యాసింజర్ రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆల్టింగ్ చేయాలని ఇప్పటికీ ప్రజా ప్రతినిధులకు, రైల్వే అధికారులకు అందరికి వినతిపత్రాలు అందజేశాం. ఇప్పటివరకు స్పందన లేదు. ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

జన చైతన్య యాత్ర విజయవంతం చేయాలి

- సీపీఐ(ఎం) నాయకుడు గెడం టీకానంద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సంక్షేమం మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదాం అని లక్ష్యంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) నాయకుడు గెడం టీకానంద్ అన్నారు. తిర్యాని మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద కార్పొరేటు విధానాలను వ్యతిరేకించాలని మార్చి23 నుండి 29 వరకు సీపీఐ(ఎం) అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నాట్టు తెలిపారు. జిల్లాలో నిర్వహించే ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. మోడీ, అమిత్ షాల నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతూ 123 కోట్ల మందిని నిరుపేదలుగా చేశారన్నారు. దేశం అంటే అంబానీ ఆదాని సొత్తుగా మార్చేశారన్నారు. నూనెలు, వంటగ్యాస్, పెట్రోల్, డిజిల్‌తోసహా అన్ని సరుకుల ధరలు రెండు మూడు వందల రెట్లు పెంచారన్నారు. 2014లో 410 ఉన్న గ్యాస్ బండ నేడు రూ.1150 పెరిగిందన్నారు. ఈ ధరలు పెరుగుదల వల్ల కార్పొరేటు శక్తులు రూ.వేల కోట్ల లాభాలను గడిస్తున్నాయన్నారు. ఈ చర్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని దీనికోసం నిర్వహించే జనచైతన్య యాత్ర విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, రాజేష్, ఉమాకాంత్, గణేష్, నగేష్, రంజిత్ పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని చింతలపల్లి గ్రామంలో సీపీఐ(ఎం) మండల శాఖ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర పోస్టర్లను పార్టీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ నాయకులు ఎస్కే అబ్దుల్లా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామన్నారు. కార్మిక హక్కులు, కార్మిక చట్టాల రక్షణ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరణ, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు, పని దినాలు 200 రోజులు పెంచి, కనీస వేతనం రూ.600 నిర్ణయించడం, ధరల పెరుగుదలను నియంత్రించడం, రైతు పండించే అన్ని ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించి, కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోడిపల్లి రవి, మెట్పల్లి అమ్మాయి, ముదేళ్ల లక్ష్మి, కల్లెడ కలవ్వ పాల్గొన్నారు.

రెబ్బెన : మండలకేంద్రంలో సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర వాల్‌పోస్టర్లను ఆ పార్టీ నాయుకులు చాపిడి పురుషోత్తం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని, సంక్షేమం మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. మార్చి 23వ తేదీ నుండి 29వ తేదీ వరకు సీపీఐ(ఎం) పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో జన చైతన్య యాత్రలు జరుగుతాయన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, లౌకిక వాదులు, మేథావులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో చాపిడి శివ, ప్రశాంత్, కృష్ణ, రఘు, తిరుపతి పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి మిని స్టేడియం తలమానికం

- ఎమ్మెల్యే దివాకర్ రావు



నవ తెలంగాణ-లక్షెట్టిపేట్

మున్సిపాలిటీకి మిని స్టేడియం తలమానికంగా నిలుస్తుందని ఎమ్మెల్యే దివాకర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో మిని స్టేడియంలోని పోడియం కాంప్లెక్స్‌కు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగాది పర్వదినాన అభివృద్ధి పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. సింగరేణి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.30 లక్షలతో పోడియం కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయినటువంటి 26 షటర్స్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని వివరించారు. అనంతరం వచ్చే 25న మంచిర్యాలలో పార్టీ అంతర్గత సమావేశం ఉంటుందని మండలంలోని నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. త్వరలో ప్రభుత్వం విడుదల చేయనున్న దళిత బంధు, గృహ లక్ష్మీ పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నియోజకవర్గంలో సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, నడిపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్ బాబు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు సురేష్ నాయక్, శ్రీకాంత్, మెట్టు కళ్యాణి రాజు, నాయకులు బాణాల రమేష్, కాంతయ్య, రాజన్న, సుమన్ పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- శ్రీరాంపూర్ సీఐ రాజు


నవతెలంగాణ-జైపూర్



ప్రారంభమవుతున్న రంజాన్ మాసంతో పాటు ఈ నెల చివరిలో వస్తున్న శ్రీరామ నవమి పండుగలను మండల పరిధిలో ప్రశాంతంగా జరుపుకోవాలని శ్రీరాంపూర్ సీఐ రాజు కోరారు. బుధవారం ఇందారం గ్రామంలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో స్థానిక సీఐ రామకృష్ణతో కలిసి మాట్లాడారు. మండల పరిధిలో ప్రతి ఒక్కరు సోదర భావం కలిగివుండి శాంతియుత వాతారణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. హిందు, ముస్లీం మత పెద్దలలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానంగా సోషల్ మీడియాలో వచ్చే వదంతుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అసత్య వార్తలను నమ్మి ప్రచారం చెయ్యవద్దని కోరారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉండే సమస్యలను అడిగి తెల్సుకోవడంతో పాటు సమస్యలకు పరిష్కారమార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక గ్రామ పెద్దలు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెద్దపల్లి రమేశ్, గడ్డం ప్రసాద్, ఎంపీటీసీ సంతోష్, వెంకటేశ్, శ్రీనివాస్, ముస్లీం మత పెద్దలు తాజుద్దీన్, ఫయాజుద్దీన్, జైనుద్దీన్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని మద్దిమాడ శివారులోని చేనులో మద్దిమాడకు చెందిన మారినేని కిష్టయ్య(42) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు దేవాపూర్ ఎస్సై విజయేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిమాడకు చెందిన కిష్టయ్య భార్య మూడేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై భార్యను తలుచుకుంటూ బాధ పడుతూ ఉండేవాడు. బుధవారం తెల్లవారుజామున మద్దిమాడ శివారులోని పత్తి చేనులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి చిన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటు తెలిపారు.